క్లుప్తంగా

మహిళలకు ఇచ్చిన హామీని అమలు చేయాలి

నల్లగొండ టౌన్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో మహిళలకు నెలకు రూ.2500 ఇస్తామన్న హామీని వెంటనే అమలు చేయాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి డిమాండ్‌చేశారు. బుధవారం స్థానిక దొడ్డి కొమరయ్య భవనంలో పోలెబోయిన వరలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఐద్వా జిల్లా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ కార్యాలయాల్లో జిల్లా అధికారుల నుంచి మండల స్థాయి అధికారుల వరకు సమయపాలన పాటించడం లేదని ఆరోపించారు. మద్యపానం వల్ల మహిళలపై దాడులు జరుగుతున్నాయన్నారు. జిల్లా వ్యాప్తంగా మహిళల సమస్యలపై ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర కమిటీ సభ్యులు కొండ అనురాధ, జిట్టా సరోజ, చనబోయిన నాగమణి, భూతం అరుణకుమారి, తుమ్మల పద్మ, కారంపూడి ధనలక్ష్మి, మహమ్మద్ సుల్తానా, దామెర లక్ష్మి, అరుణ, ఉమారాణి, కౌసల్య, జంజిరాల ఉమా, భక్త పద్మ, పార్వతమ్మ పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత



ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రాలను అందజేస్తున్న స్నేహితులు

చిట్యాల: పట్టణానికి చెందిన చిత్రగంటి ప్రభాకర్(34) ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. పేదరికంలో ఉన్న ప్రభాకర్ కుటుంబాన్ని ఆదుకునేందుకు అతడితో కలిసి చిట్యాల జెడ్పీహెచ్ఎస్‌లో 2004–05 విద్యా సంవత్సరంలో ఎస్సెస్సీ చదువుకున్న స్నేహితులు ముందుకు వచ్చారు. వారంతా కలిసి సేకరించిన రూ.50 వేలను ప్రభాకర్ పిల్లల పేరున ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి.. ఆ పత్రాలను బుధవారం అందజేశారు. కార్యక్రమంలో సాగర్ల మహేష్, జిట్ట నరేష్, కదారి వెంకన్న, శ్రీశైలం, ఊషిరాం, కృష్ణ, శేఖర్ పాల్గొన్నారు.

నీలకంఠేశ్వరుడిగా శివుడు



రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని పాతబస్తీ సంతోషిమాత ఆలయంలో కార్తీక మాసం పూజలను బుధవారం ఘనంగా నిర్వహించారు. 19వ రోజు శివుడిని నీలకంఠేశ్వర స్వామిగా అలంకరించి పూజలు చేశారు.

ఆర్థికసాయం అందజేత



నగదు అందజేస్తున్న శేఖర్

మునుగోడు: మండలంలోని కోతులారం గ్రామానికి చెందిన కత్తుల బుచ్చమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. బుధవారం ఆమె మృతదేహాన్ని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు వట్టికోటి శేఖర్ సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన వెంట ఆ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఏపూరి యాదయ్య, పందుల అంజయ్య, గుండు రవీందర్, చిన్న కృష్ణయ్య, ఏర్పుల అంజయ్య, హనుమయ్య తదితరులు ఉన్నారు.

సీపీఎం మండల కార్యదర్శిగా పెంజర్ల సైదులు



కట్టంగూర్ : మండలంలోని ఇస్మాయిల్‌పల్లి గ్రామంలో మంగళవారం జరిగిన సీపీఎం మండల మహాసభలో ఇస్మాయిల్‌పల్లికి చెందిన పెంజర్ల సైదులును సీపీఎం మండల కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదే విధంగా మండల కమిటీ సభ్యులుగా 19 మందిని ఎన్నుకున్నారు.

విద్యుత్ శాఖ అధికారులపై ఫిర్యాదు

తిప్పర్తి : మండలంలోని జంగారెడ్డిగూడెం గ్రామానికి చెందిన రైతుల విద్యుత్ సమస్యలను తిప్పర్తి మండల విద్యుత్ శాఖ అధికారులు పరిష్కరించడం లేదని బుధవారం నల్లగొండలో ఎస్ఈ కి గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. గ్రామంలో అక్రమ మోటర్ కనెక్షన్లు తొలగించాలని, లూజ్‌లైన్ల నివారణకు నూతనంగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరారు. విద్యుత్ మోటార్ మంజూరు కోసం డీడీ కట్టి సుమారు 20 రోజులు గడుస్తున్నా ఇవ్వడం లేదని, ట్రాన్స్‌ఫార్మర్ల దిమ్మెలు రైతులతోనే కట్టిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొనట్లు రైతులు తెలిపారు.

రోడ్లపై ప్రమాదకరంగా గుంతలు



కల్మెర రోడ్డులో పోస్టాఫీస్ సమీపంలో రోడ్డు పై ప్రమాదకరంగా ఉన్న గుంత



కట్టంగూర్ రెండో వార్డులో రోడ్డుపై డ్రైయినేజీ ధ్వంసమై తేలిన ఇనుప చువ్వలు

- ధ్వంసమైన రహదారులు
- ప్రమాదాలబారిన పడుతున్న ప్రజలు
- గుంతలను పూడ్చడంలో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులు

కట్టంగూర్ : మండలకేంద్రంలోని పోస్టాఫీస్ సమీపంలో కల్మెర రోడ్డుపై ఏర్పడిన గుంత ప్రమాదకరంగా మారింది. ఇంటింటికీ నీటి సరఫరాలో భాగంగా గ్రామ పంచాయతీ సిబ్బంది ఇటీవల రోడ్డును తవ్వి నల్లా పైపులైన్ ఏర్పాటు చేసి ఆ ప్రాంతంలో నూతనంగా నిర్మించుకున్న ఇళ్లకు కనెక్షన్ ఇచ్చారు. కట్టంగూర్ మండలంలోని పలు గ్రామాల ప్రజలు పనుల నిమిత్తం తహసీల్దార్ కార్యాలయం, గ్యాస్ కంపెనీ, ఎంపీడీఓ కార్యాలయం, పోస్టాఫీస్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఈ దారి గుండానే నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఈదులూరు, పరడ, పందెనపల్లి, కల్మెర, మునుకుంట్ల, కుమ్మరిగూడెం, తక్కెళ్లపాడుతోపాటు శాలిగౌరారం మండల ప్రజలు ఈ దారిగుండా నల్లగొండకు రాకపోకలు సాగిస్తారు. వాహనాల రద్దీతో పైపులైన్ వేసిన ప్రాంతంలో మోకాలు లోతు గుంత ఏర్పడి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రాత్రిపూట ఈ దారి గుండా వెళ్లేందుకు ద్విచక్ర వాహనదారులు జంకుతున్నారు. ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు గుంత ప్రాంతంలో ద్విచక్ర వాహనంపై వెనుక కూర్చున్న వ్యక్తులు, మహిళలు కిందపడి గాయాలపాలవుతున్నారు. పలుమార్లు అధికారులకు చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆ ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి గుంతను పూడ్చాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

రెండో వార్డులో డ్రైయినేజీపై..

కట్టంగూర్ మండల కేంద్రంలోని రెండో వార్డులో సాందీపని పాఠశాల సమీపంలో ఉన్న డ్రైయినేజీపై ఉన్న కప్పు కూలి రంధ్రం ఏర్పడింది. నిత్యం ఆ ప్రాంత ప్రజలతోపాటు పాఠశాల విద్యార్థులు ఈ దారిగుండా వెళుతూ డ్రైయినేజీలో కాలుపడి ప్రమాదాలకు గురవుతున్నారు. నెల రోజులుగా ప్రజలు, విద్యార్థులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా గ్రామ పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. డ్రైయినేజీ దెబ్బతినడంతో ఆటోలు, బస్సులు వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. డ్రైయినేజీ పైకప్పు శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలుతుందోనని ప్రజలు, విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. రాత్రి పూట ఈ దారిగుండా వెళ్లే ప్రజలు డ్రైయినేజీలో కాలు పడి ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు చొరవ చూపి డ్రైయినేజీకి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి



మండల కేంద్రంలోని పోస్టాఫీస్ సమీపంలో కల్మెర రోడ్డుపై గుంత లోతుగా ఏర్పడడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వాహనదారులు దగ్గరకు వచ్చేంతవరకు గుంత కనిపించకపోవడంతో గుంతలో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు చొరవ చూపి రోడ్డుపై ఏర్పడిన గుంతతోపాటు డ్రైయినేజీకి మరమ్మతులు చేపట్టాలి.

– మిట్టపల్లి శివశంకర్, కట్టంగూర్

మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ ధ్యేయం



నార్కట్‌పల్లిలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

నార్కట్‌పల్లి : గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ ధ్యేయమని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. బుధవారం నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని 5వ వార్డులో రూ.5లక్షల వ్యయంతో నిర్మించే సీసీ రోడ్డుకు, అయ్యప్పగుడి సమీపంలో రూ.10 లక్షలతో నిర్మించే కమ్యూనిటీ హాల్‌కు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఊషయ్యగౌడ్, నాయకులు జేరిపోతుల భరత్, సట్టు సత్తయ్య, దూదిమెట్ల సత్తయ్య, ప్రజ్ఞాపురం సత్యనారాయణ, గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలోనే పేదలకు మెరుగైన వైద్యం

- డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న కుంభం శ్రీనివాస్‌రెడ్డి

మునుగోడు: కాంగ్రెస్ పాలనలోనే పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందుతోందని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మునుగోడు మండలంలోని కల్వకుంట్ల గ్రామానికి చెందిన చెరుకూరి ముత్తమ్మ, మేక బాసిరెడ్డి ఇటీవల అనారోగ్యానికి గురై ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందారు. స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సహకారంతో సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా.. ముత్తమ్మకు మంజూరైన రూ.16500, బాసిరెడ్డికి మంజూరైన రూ.15వేల విలువ గల చెక్కులను బుధవారం కుంభం శ్రీనివాస్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి నియోజకవర్గంలోని పేద ప్రజలకు అండగా ఉండి ప్రభుత్వం నుంచి అందే సహాయంతోపాటు తన సొంత డబ్బులతో వైద్యసేవలు అందిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పోలగోని సత్యంగౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు, గ్రామశాఖ అధ్యక్షుడు బొందు రవి, స్వామి, మల్లేష్, యాదయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనం.. నిరంతర ప్రక్రియ



క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులతో అదనపు కలెక్టర్ శ్రీనివాస్



గోనారెడ్డిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్

- అదనపు కలెక్టర్ శ్రీనివాస్

రామగిరి(నల్లగొండ): పుస్తక పఠనం నిరంతర ప్రక్రియగా ఉండాలని అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ అన్నారు. నల్లగొండలోని జిల్లా కేంద్ర గ్రంథాలయలో బుధవారం జరిగిన 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. గ్రంథాలయాల విశిష్టతను తెలియజేసేలా వారం రోజుల పాటు వారోత్సవాలు నిర్వహించిన సిబ్బందిని అభినందించారు. డిజిటలైజేషన్ దూసుకెళ్తున్నప్పటికీ పుస్తక పఠనానికి ప్రాధాన్యత తగ్గలేదన్నారు. డిజిటల్ టెక్నాలజీతో నూతన గ్రంథాలయ భవన నిర్మాణానికి ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందినవారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర మాజీ చైర్మన్ జెల్లా మార్కండేయులు, జిల్లా గ్రంథాలయ పరిషత్ మాజీ చైర్మన్ గాదె వినోద్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ సెక్రటరీ బి.బాలమ్మ, కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్ సీఈఓ మారం గోనారెడ్డి, సిబ్బంది నాగేశ్వర్‌రావు, నరసింహారెడ్డి, వెంకట్రామిరెడ్డి, కట్టా నాగయ్య, రాజేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బహుమతులు అందజేత

నల్లగొండ: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా జిల్లా గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో నల్లగొండలోని డాన్ స్కూల్ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ప్రతిభ చూపిన విద్యార్థులు మణిదీప్, చాణక్యదీప్, అర్జున్‌కు బుధవారం అదనపు కలెక్టర్ శ్రీనివాస్, గ్రంథాలయ శాఖ కార్యదర్శి బాలమ్మ బహుమతులు అందజేశారు. విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ జోసెఫ్, వైస్ ప్రిన్సిపాల్ అను, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థులు గ్రంథ పఠనం చేయాలి

నల్లగొండ టౌన్: విద్యార్థులు గ్రంథ పఠనం చేసి విజ్ఞానం సంపాదించుకోవాలని కోమటిరెడ్డి ప్రతీక్ మెమోరియల్ ఫౌండేషన్ సీఈఓ గోనారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జరిగిన గ్రంథాలయ వారోత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు మంచి పుస్తకాలు చదివితే అవి వారిని శిఖరాగ్రాన నిలబెడతాయని అన్నారు. ఈ సందర్భంగా గోనారెడ్డి, మాజీ గ్రంథపాలకుడు వెంకట్రాంరెడ్డిలను సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సి పాల్ సుధారాణి, గ్రంథ పాలకులు కంది శ్రీనివాసులు, విద్యార్థులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లిలో గ్రంథాలయ వారోత్సవాలు

నాంపల్లి : అందరికి దేవాలయం గ్రంథాలయమని బాలల సంక్షేమ సమితి సభ్యుడు ఈద భాస్కర్ అన్నారు. నాంపల్లి మండల కేంద్రంలోని గ్రంథాలయంలో బుధవారం నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం గ్రంథాలయం అటెండర్ గాదెపాక మారయ్యను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు అజయ్‌కుమార్, కామిశెట్టి యాదయ్య, సైదులు, శంకరయ్య, కర్నె యాదయ్య, వెంకటయ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పాలన కళాయాత్రలను విజయవంతం చేయాలి

నల్లగొండ: ప్రజా పాలన కళాయాత్రలను విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు రెండు బృందాలుగా ఏర్పడి డిసెంబర్ 7 వరకు రోజూ రెండు మేజర్ గ్రామపంచాయతీలు, మండల కేంద్రాల్లో కార్యక్రమాలను ఇస్తున్నారని తెలిపారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్ అధికారులకు పంపించామన్నారు. కళాకారులకు అవసరమైన వసతిని ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, డీపీఆర్ఓ వెంకటేశ్వర్లు, జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, డీపీఓ మురళి పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

శాలిగౌరారం: నార్కట్‌పల్లిలో ఈ నెల 24న జరగనున్న టీఎస్ యూటీఎఫ్ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షుడు రాగి రాకేశ్ కోరారు. శాలిగౌరారం మండలంలోని మాధారంకలాన్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం మహాసభలకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



మర్రిగూడ : వినతిపత్రం అందిస్తున్న నాయకులు

చిట్యాల: పేదలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేసి, సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ధర్మ సమాజ్ పార్టీ చిట్యాల మండల నాయకులు బుధవారం డిప్యూటీ తహసీల్దార్ విజయకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా పార్టీ మండల కన్వీనర్ మేడి రాజేష్ మాట్లాడుతూ పేదలకు ఉచిత వైద్యం, విద్యతోపాటు ఎకరం భూమి, నాలుగు గదుల ఇల్లు, ఉపాధి అవకాశాలను కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కో కన్వీనర్ మంకాల రాకేష్, వడ్డెపల్లి నరేష్, మండల కమిటీ సభ్యుడు ప్రేమ్ కుమార్, వెలిమినేడు గ్రామ అధ్యక్షుడు చింతకింది మహేష్, నందిపాటి శివకుమార్, మేడి దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

మర్రిగూడ : బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ ధర్మ సమాజ్ పార్టీ జిల్లా కో కన్వీనర్ గిరిమహారాజ్ బుధవారం డిప్యూటీ తహసీల్దార్ జూటూరు తారకరామన్‌కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలోని పేద విద్యార్థులకు కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందించాలని, ఆధునిక ఆస్పత్రులు నిర్మించి పేదలకు ఉచిత వైద్యం అందించాలని కోరారు. ఇళ్లు లేని పేదలను గుర్తించి వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, ఉపాధి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో వినోద్, జగన్, సైదులు,పాపయ్య పాల్గొన్నారు.

ఎర్ర జెండాను ఆదరించి విరాళాలు ఇవ్వండి



నల్లగొండ రూరల్: ప్రచారం చేస్తున్న నాయకులు

నల్లగొండ రూరల్: ఎర్ర జెండాను ఆదరించి సీపీఎం నిర్వహిస్తున్న ఉద్యమాలకు విరివిగా విరాళాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పాలడుగు నాగార్జున కోరారు. బుధవారం నల్లగొండ మండలంలోని అన్నారెడ్డిగూడెం గ్రామంలో ఇంటింటికీ సీపీఎం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అన్నారెడ్డిగూడెం గ్రామంలో ఇంటింటికి తిరిగి సమస్యలను అధ్యయనం చేశామని తెలిపారు. డిసెంబర్ 2 నుంచి 4వ తేదీ వరకు మిర్యాలగూడ పట్టణంలో నిర్వహించనున్న జిల్లా 21వ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యురాలు కొండ అనురాధ, నలుపురాజు సైదులు, కొండ వెంకన్న, కొత్త అంజయ్య, భక్తుల వెంకన్న, చంద్రశేఖర్, శ్రీను పాల్గొన్నారు.

2న సీపీఎం బహిరంగ సభ

నార్కట్‌పల్లి : మిర్యాలగూడలో డిసెంబర్ 2న నిర్వహించే సీపీఎం బహిరంగ సభను జయప్రదం చేయాలని మాజీ వైస్ ఎంపీపీ కల్లూరి యాదగిరి పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని ఎల్లారెడ్డిగూడెం గ్రామంలో సీపీఎం నాయకులతో కలిసి బహిరంగ సభ పోస్టర్‌లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యుడు కుమ్మరి శంకర్, రవి, బొల్లెద్దు సైదులు, నాగరాజు, శ్రీను, శంకరయ్య, వట్టిపర్తి నర్సింహ, గంధం కృష్ణ పాల్గొన్నారు.

బహిరంగ సభ పోస్టర్ ఆవిష్కరణ

శాలిగౌరారం: మిర్యాలగూడలో డిసెంబర్ 2న జరగనున్న సీపీఎం బహిరంగ సభను విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి చలకాని మల్లయ్య కోరారు. బహిరంగ సభకు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం శాలిగౌరారం మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కల్లూరి లింగయ్య, మక్క బుచ్చిరాములు, సిరుపంగి అంజయ్య, దాసరి దేవచిత్తం, బట్ట అవనిజ, చలకాని పరమేశ్, కుమార్, గుండ్లపల్లి వెంకన్న, బల్లెం వెంకటయ్య, కల్లూరి అంజయ్య పాల్గొన్నారు.

23న మాదిగల ఆత్మీయ సమ్మేళన సభ



నినాదాలు చేస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్: జిల్లా కేంద్రంలో ఈ నెల 23న నిర్వహించనున్న మాదిగల ఆత్మీయ సమ్మేళన సభను విజయవంతం చేయాలని మాదిగ జేఏసీ చైర్మన్ కత్తుల జగన్ కోరారు. బుధవారం మాదిగ జేఏసీ ఆధ్వర్యంలో నల్లగొండలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నల్లగొండ పట్టణంలోని ప్రతి వార్డులో మాదిగ సమ్మేళన సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో కత్తుల తులసీదాస్, నాగుల నరసింహ, కత్తుల సందీప్ సన్నీ, బుర్రి స్వామి, దాసరి నరసింహ, దాసరి నవీన్ పాల్గొన్నారు.

ముందస్తు అరెస్ట్

మిర్యాలగూడ : లగచర్ల ఫార్మా గిరిజన బాధితులను పరామర్శించేందుకు వెళ్తున్న తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ముడావత్ ధర్మానాయక్, శ్రీరాములునాయక్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకటరాములు, రైతు సంఘం నాయకుడు శోభనాయక్‌లతోపాటు మరో 30 మందిని వాడపల్లి పోలీసులు మంగళవారం ముందస్తు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లగచర్లలో గిరిజనుల ఇండ్లలోకి పోలీసులు అక్రమంగా ప్రవేశించి మహిళలు అని చూడకుండా అసభ్యంగా ప్రవరిస్తూ దాడులు చేయడం హేయమైన చర్య అన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే వేముల వీరేశం



ధ్వజ స్తంభానికి మొక్కుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



వేడుకల్లో పాల్గొన్న పీఠాధిపతి శ్రీధర్ స్వామీజీ

నకిరేకల్ : పట్టణంలోని వైశ్య భవనం వెనుక సుమారు కోటి రూపాయల వ్యయంతో నిర్మించిన శ్రీ వాసవి కన్యాకాపరమేశ్వరి ఆలయం, దేవత విగ్రహం, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవాలు బుధవారం వైభవంగా జరిగాయి. పశ్చిమ గోదావరి జిల్లా ముక్కాముల పీఠాధిపతి శ్రీధర్ స్వామీజీ చేతులమీదుగా ప్రతిష్ఠాపన మహోత్సవాలు నిర్వహించారు. భారీ క్రేన్ సహాయంతో ధ్వజ స్తంభాన్ని ఏర్పాటుచేశారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, కాంగ్రెస్ నేత దైద రవీందర్, మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజితాశ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్‌లు వేర్వేరుగా హాజరై పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఆలయ కమిటీ నిర్వాహకులు గర్రె రామ్మూర్తి, బ్రహ్మదేవర విశ్వనాథం, లక్ష్మయ్య, పద్మాకృష్ణమూర్తి, గర్రె వెంకన్న, శ్రీనివాస్, రాంబాబు, లక్ష్మీ, బ్రహ్మదేవర నర్సింహారావు, వీర్లపాటి కృష్ణ, ఆర్యవైశ్య సంఘం మండల, పట్టణ అధ్యక్షులు బ్రహ్మదేవర రాంమోహన్‌రావు, వీర్లపాటి నర్సింహారావు, గర్రె మురళీమోహన్, రమేష్, రామకృష్ణ, పోతుగంటి రామ్మూర్తి, అశోక్, వేంకటేశ్వర స్వామి ఆలయ మాజీ చైర్మన్ జానయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రేయర్ డే ను విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న రాజేశ్వర్‌రావు

రామగిరి(నల్లగొండ): హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో ఈ నెల 27న జరిగే ప్రేయర్ డే ను జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్సీ డి.రాజేశ్వర్‌రావు కోరారు. బాప్టిస్టు చర్చిలో క్రిస్టోఫర్ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన ప్రేయర్ డేకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రేయర్ డే పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ హైదరాబాద్‌లో జరిగే ప్రేయర్ డేకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి లక్షలాది మంది క్రిస్టియన్లు హాజరవుతారని తెలిపారు. చర్చి పాస్టర్లు, కమిటీ సభ్యులు రెవరెండ్ డాక్టర్ పంక ప్రవీణ్‌కుమార్, జాకబ్, కె.మోజెస్, శౌరయ్య, సంజీవయ్య, టి.ఎలిషా, ఎస్.ఆనంద్‌ప్రసాద్, ఆశయ్య, ప్రశాంత్, జయప్రకాశ్, లక్ష్మయ్య, జేమ్స్, శ్రీధర్, ఏ.బెంజిమన్ పాల్గొన్నారు.

జలమయమైన ప్రధాన రహదారి



తిప్పర్తి మండల కేంద్రం సమీపంలో ప్రధాన రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు

తిప్పర్తి : ఏఎమ్మార్పీ డీ–40 ప్రధాన కాలువ నుంచి ఆర్–24 మైనర్ కాలువ ద్వారా తిప్పర్తి మండల కేంద్రంలోని కోమటికుంటకు అధికారులు ఇటీవల నింపారు. అయితే కుంట నిండి నీరు మొత్తం రెండు రోజులుగా మండల కేంద్రంలోని ప్రధాన రోడ్డుపైకి చేరింది. రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్, శ్మశానవాటిక, పెట్రోల్ బంకులలోకి నీరు చేరింది. దీంతో పలువురు గ్రామస్తులు ఏఎమ్మార్పీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ఏఎమ్మార్పీ డీఈ ఆంజనేయస్వామిని వివరణ కోరగా తమ దృష్టికి వచ్చిన వెంటనే నీటిని నిలుపుదల చేశామని తెలిపారు.

కేంద్రీయ విద్యాలయంలో స్పోర్ట్స్ డే వేడుకలు



బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అంజిరెడ్డి

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని కేంద్రీయ విద్యాలయంలో స్పోర్ట్స్ డే వేడుకలను బుధవారం పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఎంజీయూ ఎకనామిక్స్ ప్రొఫెసర్ కె.అంజిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మార్చ్‌ఫాస్ట్ చేశారు. అనంతరం క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏ.రవికుమార్, ఉత్కర్ష, సందీప్, నెహ్రూ, విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

24న సీపీఎం మహాసభ



మాట్లాడుతున్న కందాల ప్రమీల

కేతేపల్లి: మండల కేంద్రంలో ఈ నెల 24 నిర్వహించనున్న సీపీఎం 8వ మండల మహాసభలను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు కందాల ప్రమీల పిలుపునిచ్చారు. బుధవారం కేతేపల్లిలోని నిర్వహించిన సీపీఎం మండల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ చినవెంకులు, నాయకులు నంద్యాల కృపాకర్‌రెడ్డి, వేనేందర్‌రెడ్డి, సీహెచ్.లూర్థుమారయ్య, ఏళ్ల అశోక్‌రెడ్డి, ఎల్.రాజు, చెరుకు సత్తయ్య, గోలి ఎల్లయ్య పాల్గొన్నారు.